


నిర్లక్ష్యాన్ని నిలదీస్తే.. న్యూసెన్స్..!

విస్తుగొలిపేలా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల తీరు



రాజును మందలిస్తున్న పోలీసులు

గుత్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మనవరాలి జనన ధ్రువీకరణ పత్రం కోసం ఆస్పత్రి చుట్టూ తిరిగి విసిగిపోయిన ఓ వ్యక్తి.. గట్టిగా నిలదీయడంతో పోలీసులను పిలిపించారు. విధుల పట్ల అలసత్వం వహించింది కాక.. న్యూసెన్స్ చేస్తున్నాడని బాధితుడిపైనే ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గుత్తి మండలం తొండపాడు గ్రామానికి చెందిన రాజు కూతురు సురేఖ జూన్ 21న గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించారు. నెల క్రితం తన మనవరాలి బర్త్ సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో రాజు దరఖాస్తు చేసుకున్నాడు. ఎప్పుడు వెళ్లినా దరఖాస్తు కనిపించడంలేదని సిబ్బంది తిప్పుకుంటున్నారు. ఇప్పటికా నాలుగు సార్లు దరఖాస్తు ఇచ్చానని, సర్టిఫికెట్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితుడు ఆరోపించాడు. ఈ క్రమంలో గురువారం మరోమారు ఆస్పత్రికి వచ్చిన బాధితుడు.. సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో ఓ వైద్యుడితో వాదనకు దిగాడు. ఎన్నిసార్లు తిప్పుకుంటారని నిలదీశాడు. దీంతో వైద్యుడు పోలీసులకు ఫోన్ చేసి పిలిపించాడు. పోలీసులు వచ్చి బాధితుడినే మందలించారు. వైద్యుడు చెప్పినట్లు వినాలని చెప్పి వెళ్లిపోయారు. సర్టిఫికెట్ ఇచ్చేవరకూ కదిలేది లేదని బాధితుడు పట్టుబట్టడంతో గత్యంతరం లేక సిబ్బంది అప్పటికప్పుడు తయారు చేసి ఇచ్చారు. ఆస్పత్రిలో నిర్లక్ష్యం గురించి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్పను వివరణ కోరగా, విచారించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

యువతకు వాల్మీకి స్ఫూర్తి



మాట్లాడుతున్న మంత్రి సవిత, వేదికపై ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు

- రామాయణాన్ని ప్రపంచానికి తెలిపిన మహనీయుడు
- వాల్మీకుల 'ఎస్టీ' పునరుద్ధరణకు చంద్రబాబు, లోకేశ్ కృషి
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- అనంతలో ఘనంగా రాష్ట్రస్థాయి వాల్మీకి జయంత్యుత్సవాలు
- హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రామాయణాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి వాల్మీకి మహర్షి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. నేటితరం యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతపురం నగరంలో గురువారం వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి పాతూరు పవర్ ఆఫీస్ సమీపంలోని వాల్మీకి విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుత్తి రోడ్డులోని బల్లా కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన వేడుకలలో పాల్గొన్నారు. వాల్మీకి జయంతి వేడుకలను రాష్ట్రస్థాయిలో నిర్వహించడం ద్వారా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై వారు గట్టిగా నిలబడ్డారని అన్నారు. దేవుళ్లు ఎలా ఉంటారో ఎన్టీఆర్ చూపించారని, బడుగు, బలహీన వర్గాల కష్టనష్టాలను గుర్తించిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని అన్నారు.

(మిగతా 7వ పేజీలో)

వ్యాధులు ప్రబలకుండా చూడండి

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి



కాన్ఫరెన్స్‌లో డాక్టర్లు, సిబ్బందికి ఆదేశాలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వైద్యులు, వైద్య సిబ్బందికి డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. జిల్లా కార్యాలయం నుంచి గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా మళ్లీ దోమలు ప్రబలే ప్రమాదం ఉందని, వ్యాధులు సంక్రమిస్తాయని హెచ్చరించారు. జలుబు, జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు, అతిసారం వంటి కేసులు పెరిగే ప్రమాదం ఉంటుందని అన్నారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా ఆస్పత్రులలో అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. తగినన్ని మందుల నిల్వలను తప్పనిసరిగా ఆస్పత్రిలో ఉంచుకోవాలని సూచించారు. ఔషధాలు లేకపోతే డ్రగ్స్ గోడౌన్‌కు నేరుగా వెళ్లి తీసుకుపోవాలని అన్నారు. అత్యవసరమైతే మందులను కొనుగోలు చేసి రోగులకు అందించాలని సూచించారు. మందులు లేవనే మాట ఎక్కడా వినపడకూడదని అన్నారు. ప్రస్తుతం ఏ ఒక్కరికీ సెలవులు ఇవ్వమని, ప్రతి ఒక్కరూ విధులకు హాజరు కావాలని సూచించారు. మలేరియా అధికారులు, యూనిట్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎక్కడైనా వర్షపునీరు నిలిస్తే.. అధికారుల సహకారంతో తొలగించాలని సూచించారు. సర్పంచులతో మాట్లాడి, దోమల నివారణకు క్లోరినేషన్ చేయించాలని సూచించారు. రాబోయే 15 రోజులుపాటు వైద్యశాఖలో పనిచేసే ప్రతిఒక్కరూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మద్యం దుకాణాలకు గదుల సమస్య

రెండోరోజు మరో 107 ప్రారంభం

అనంతపురం అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలను దక్కించుకున్న పలువురు అద్దె గదుల కోసం తంటాలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలను ప్రారంభించాల్సి ఉంది. మొత్తం 136 మద్యం దుకాణాలకు గానూ తొలిరోజు 47 మాత్రమే ప్రారంభమయ్యాయి. రెండో రోజు గురువారం మరో 107 దుకాణాలను తెరిచారు. ఇంకా 29 దుకాణాలను ప్రారంభించాల్సి ఉంది. ఎంపిక చేసుకున్న ప్రాంతాలలో అద్దెకు గదులు దొరక్కపోవడంతో మరో ప్రాంతంలో ప్రయత్నిస్తున్నామని కొందరు తెలిపారు. మిగిలిన దుకాణాలు శుక్రవారం సాయంత్రానికి ప్రారంభించే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. కొన్నింటిని ప్రారంభించకపోవడం, ఇప్పటికే ప్రారంభించిన దుకాణాలలో మద్యం నిల్వలు తక్కువగా ఉండటం బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులకు అనుకూలంగా మారింది. అనంతపురం నగరంతోపాటు మరి కొన్ని ప్రాంతాల్లోనని బార్‌లలో క్వార్టర్‌పై బ్రాండ్‌ను బట్టి రూ.120 నుంచి రూ.140 అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా పూర్తి స్థాయిలో మద్యం దుకాణాలను తెరవాలని, అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉంచాలని మద్యం ప్రియులు కోరుతున్నారు. మరోవైపు మద్యం ధరలు ఎప్పటిలోగా తగ్గిస్తారో తెలియని అయోమయం నెలకొంది. మద్యం ధరల తగ్గింపుపైనే సర్వత్రా చర్చ సాగుతోంది.

టమోటా కిలో రూ.60

అనంతపురం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.60తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 135 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.45, కనిష్ఠ ధర రూ.35 పలికినట్లు ఆయన తెలిపారు.

న్యూస్ బాక్స్

21న ఎమ్మెస్సీ స్పాట్ అడ్మిషన్స్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐలో ఎమ్మెస్సీ స్పాట్ అడ్మిషన్స్ ఇస్తామని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ కిరణ్మయి గురువారం తెలిపారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆదేశాల మేరకు పీజీ సెట్ కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లను భర్తీచేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని అన్నారు. 21న జేఎన్‌టీయూ పరిపాలనా భవనంలో నిర్వహించే అడ్మిషన్స్‌కు ఆసక్తిగల విద్యార్థులు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు. పీజీ సెట్‌లో అర్హత సాధించి, ఇప్పటివరకు ఎక్కడా ప్రవేశాలు పొందని వారు స్పాట్ అడ్మిషన్‌లకు అర్హులని తెలిపారు. అడ్మిషన్ అయిన వెంటనే కోర్సు ఫీజు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రైల్వే రిజర్వేషన్ కాలపరిమితి కుదింపు

ఇకపై రెండు నెలలకు ముందు మాత్రమే..

గుంతకల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణానికి రిజర్వేషన్ చేసుకునే గడువును రైల్వే శాఖ కుదించింది. అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ (ఏఆర్‌పీ) నిబంధనలను అనుసరించి ప్రస్తుతం నాలుగు నెలల ముందే బెర్త్‌ను రిజర్వేషన్ చేసుకునే వీలుంది. ఆ కాలాన్ని రైల్వే శాఖ 60 రోజులకు కుదించింది. నవంబరు 1వ తేదీ నుంచి ఈ మార్పు అమలులోకి రానుంది. ఇప్పటికే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తమ టిక్కెట్టును రద్దు చేసుకోదలిస్తే, పాత నిబంధనలను అనుసరించి నవంబరు 1 లోపు కూడా రద్దు చేసుకునే వీలు కల్పించారు.

అక్రమాలు జరక్కుండా..

నాలుగు నెలల ముందు బెర్త్ టిక్కెట్టు రిజర్వు చేసుకునే పద్ధతి అక్రమాలకు అవకాశం ఇస్తోందని రైల్వే శాఖ తెలియజేసింది. అవసరం లేకపోయినా కొందరు టిక్కెట్లను రిజర్వేషన్ చేసి, బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని పేర్కొంది. నాలుగు నెలల ముందు రిజర్వు అయిన బెర్తులు ఎక్కువ సంఖ్యలో రద్దు అవుతున్నాయని, దాదాపు 21 శాతం టిక్కెట్లు క్యాన్సిల్ అవుతున్నాయని అధికారులు తెలిపారు. త్వరగా టిక్కెట్లు అమ్ముడవుతున్నందున బెర్త్ కన్ఫర్మ్ కాదన్న కారణంగా కొందరు ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించడానికి ఇష్టపడటం లేదని, దీనివల్ల 4 నుంచి 5 శాతం మంది ప్రయాణాలకు ఇతర మార్గాలను ఎంచుకుంటున్నారని తెలియజేశారు. 1981 నుంచి ఇప్పటిదాకా రైల్వే శాఖ అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్‌ను 12 సార్లు మార్చింది. 120 రోజులు, 90 రోజులు, 60 రోజులు, 45 రోజులు, 30 రోజులు.. ఇలా పలుమార్లు ఏఆర్‌పీని మార్చింది. ప్రస్తుతం 60 రోజులకు కుదించిన కారణంగా అక్రమాలు అదుపులోకి వస్తాయని, ప్రయాణికులు చాలా ముందుగా డబ్బు చెల్లించాల్సిన అవసరం ఉండదని రైల్వే శాఖ తెలియజేసింది.

క్రైం కార్నర్

భార్య సొంతూరికి రాలేదని ఆత్మహత్య


మధుసూదన్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): భార్య సొంతూరుకు రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం పట్టణంలోని రైల్వేక్వార్టర్స్‌లో జరిగింది. రైల్వే ఉద్యోగి మధుసూదన్(34) రైల్వేక్వార్టర్స్‌లో నివాసముంటున్నాడు. ఇతను డీఆర్‌ఎం కార్యాలయంలోని కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌లో ఓఎస్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతని మొదటి భార్య రోడ్డు ప్రమాదంలో నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందింది. రెండేళ్ల క్రితం బళ్లారికి చెందిన హేమావతిని వివాహం చేసుకున్నాడు. దసరా సందర్భంగా తన సొంతూరు ప్రొద్దుటూరు మండలం లింగాపల్లికి వెళ్లాలని భార్యను కోరాడు. ఆమె నిరాకరించింది. ఈ నేపథ్యంలో అతను, అతడి కుమార్తె ఊరికి వెళ్లి సోమవారం తిరిగి వచ్చారు. అప్పటి నుంచి దిగాలుగా ఉండేవాడు. బుధవారం రాత్రి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం 9 గంటలైనా భర్త గది తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారి సాయంతో భార్య హేమావతి తలుపులు బద్దలు కొట్టించింది. ఉరివేసుకుని ఉండటం చూసి అతన్ని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన గౌస్‌పీరాపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు. ఓ యువతిని కొంత కాలంగా అతడు వేధిస్తున్నాడు. దీంతో ఆ యువతి కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి గౌస్‌పీరాను మందలించేందుకు వెళ్లారు. మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. యువతి కుటుంబ సభ్యుడు బ్రహ్మ, మధ్యవర్తిగా వెళ్లిన రాజుపై గౌస్‌పీరా కత్తితో దాడిచేయడంతో వారికి గాయాలయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు గౌస్‌పీరాపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహ్మద్ గౌస్‌బాషా తెలిపారు.

ఇంకేమీ దొరకవా..?


● ఈ చిత్రంలో కనిపిస్తున్న ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్ శింగనమల మండలం కల్లుమడి గ్రామంలోనిది. ఈనెల 9న గ్రామానికి చెందిన నాగార్జున పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగితీగను దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో చుట్టుపక్కల వ్యవసాయ కనెక్షన్లకు కరెంటు సరఫరా ఆగిపోయింది. రైతులు సాగు చేసిన పంటలకు నీరు పెట్టేందుకు ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు పేట్రేగిపోతున్నారు. వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని, అందులోని ఆయిల్, కాపర్ చోరీ చేస్తున్నారు. గడిచిన పది నెలల్లో వందకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు విద్యుత్ శాఖ అధికారుల సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేయడంతో రైతులు కరెంటు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- అనంతపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)


● యాడికి మండలంలో పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు పదుల సంఖ్యలో జరిగాయి. ఇటీవల మండలంలోని రాయలచెరువు, చందన గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేశారు. వాటిలోని రాగి, అల్యూమినియంను దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. మండలంలో ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నట్లు సమాచారం. అయితే పోలీసులు కేసులు నమోదు చేయకపోవడం గమనార్హం.


● ఇక్కడ ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్స్ బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లిలోనిది. ఈనెల 7న రాత్రి గ్రామ శివారులోని పొలాల్లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగి తీగను చోరీ చేశారు.

● రాప్తాడు మండలంలోని పాలచెర్ల గ్రామానికి చెందిన రైతులు ఎర్రిస్వామి, మల్లేష్, రాజు కలిసి 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈనెల 6న రాత్రి దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని రాగి వైరు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు.

- పేట్రేగిపోతున్న దొంగలు
- వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యం
- ఈఏడాదిలో వందకుపైగా ధ్వంసం
- కాపర్, ఆయిల్ చోరీ
- కరెంటు లేక రైతుల ఇబ్బందులు
- విద్యుత్ శాఖపై అదనపు భారం

కాపర్, ఆయిల్ చోరీ

దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాపర్, ఆయిల్ చోరీ చేస్తున్నారు. మార్కెట్‌లో కాపర్ విలువ ఎక్కువగా ఉండటంతో దొంగలు ఈ దారి ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అందులోను ఎక్కువగా వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లనే లక్ష్యంగా చేసుకుని చేస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలో అల్యూమినియం, కాపర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. వీటిలో అల్యూమినియం ట్రాన్స్‌ఫార్మర్ కంటే కాపర్ ట్రాన్స్‌ఫార్మర్ దొరికితే దొంగలకు పండగే. మార్కెట్‌లో కాపర్‌కు ధర ఎక్కువ ఉండటమే కారణం. కాగా వ్యవసాయానికి 25కేవీ, 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 30 నుంచి 35కిలోలు, 16కేవీలో 25నుంచి 30కిలోలా కాపర్ ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. మార్కెట్‌లో కిలో కాపర్ రూ.1000కిపైగానే పలుకుతోంది. కిలో అల్యూమినియం రూ.350 ఉంటోంది. దీనికితోడు ట్రాన్స్‌ఫార్మర్స్‌లోని ఆయిల్ లీటర్ రూ.100 వరకు పలుకుతోంది. వీటిని దొంగిలించి గుజిరీ షాపుల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ శాఖపై భారం

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలతో విద్యుత్ శాఖపై అదనపు భారం పడుతోంది. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనం జరిగితే..అక్కడ కొత్తది ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అల్యూమినియం 1.40లక్షలు పలుకుతోంది. ఇక కాపర్ ట్రాన్స్‌ఫార్మర్ 2.15లక్షల వరకు ఉంటోంది. 16కేవీ కాపర్ ట్రాన్స్‌ఫార్మర్ రూ.1.80లక్షలు ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈఏడాది అనధికారికంగా వంద ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అయినట్లు తెలుస్తోంది. అయితే అధికారుల లెక్క 70లోపు ఉంది. ఈ లెక్కన చూసుకున్నా సగటున ట్రాన్స్‌ఫార్మర్ ధర రూ.1.50లక్షలు అనుకున్నా 1.05కోట్లు విద్యుత్ శాఖపై అదనపు భారం పడింది.

ఎఫ్ఐఆర్ ఉంటేనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తేనే విద్యుత్ శాఖ కొత్తవి ఇవ్వడానికి వీలుంటుంది. ఎఫ్ఐఆర్ కాపీ ఆధారంగా విద్యుత్ అధికారులు ఎస్టిమేషన్ వేసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు. అయితే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. క్రైం నెంబరు పెరిగితే తమకు ఇబ్బందులు వస్తాయన్న నెపంతో ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు సంబంధిత వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

ఆ తర్వాతే మంజూరు

రైతులు ఎవరైనా ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయినట్లు ఎఫ్ఐఆర్ కాపీ తీసుకొచ్చి విద్యుత్ అధికారులకు ఇచ్చిన వెంటనే మరో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తాం. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్, ఇతరత్ర సామగ్రి కొరత ఉంది. ఈ నేపథ్యంలో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయినా సమస్య తీవ్రత మేరకు రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఈనెల చివరికి సమస్య సద్దుమణిగే అవకాశం ఉంది.

-సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

ముంచిన వాన


తొండపాడు వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు

- తడిసిన పత్తి.. వేరుశనగ
- రంగు మారితే కొనేవారు ఉండరు
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు

గుత్తి రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు వేరుశనగ, పత్తి రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. మండలంలో పలువురు రైతులు వేరుశనగ పంటను తొలగించారు. కొందరు పొలాల్లోనే కుప్పలుగా వేసుకున్నారు. వర్షానికి తడిచి కట్టె, కాయలు నల్లగా మారుతున్నాయి. పశువుల మేతగా వాడే వేరుశనగ కట్టె పనికి రాకుండాపోతోంది. రంగు మారిన కాయలను మార్కెట్‌లో కొనేవారు ఉండరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు వేరుశనగ కాయలను పొలాల్లో రాశులు పోశారు. తేమ కారణంగా ఊజి సోకుతోంది. వాటిని ఆరబోసుకునే వీలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు రైతులు పంట దిగుబడిని కాపాడుకునేందుకు వేల రూపాయలు వెచ్చించి టార్పల్‌లు కొని కప్పుకున్నారు. పత్తి పంట ప్రస్తుతం కాయ పగిలే స్థితిలో ఉంది. వర్షానికి నీరు చేరి పత్తి రంగు మారుతోంది. పత్తికాయలు మురిగిపోతున్నాయి. తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జక్కలచెరువు వద్ద సాగు చేసిన పత్తి పంట


బేతాపల్లి వద్ద తడిసిపోయిన వేరుశనగ

వర్షాలతో నష్టమే..



ఈ సమయంలో వర్షాలు పడితే పత్తికాయలు మురిగిపోతాయి. పత్తి రంగు మారుతుంది. మార్కెట్‌లో సరైన ధర పలకదు. నష్టలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎకరా పత్తి పంట సాగుకు రూ.30 వేల వరకు ఖర్చు వస్తుంది. పంట చేతికొచ్చే సమయంలో వర్షం కురిస్తే పెట్టుబడి కూడా రాదు. నేను 5 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను.

-సూర్యనారాయణ, బేతాపల్లి

చిన్నపాటి వాన

అనంతపురం అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం మోస్తరు వర్షం కురిసింది. డి.హీరేహాళ్ మండలంలో అత్యధికంగా 28.6 మి.మీ వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్‌లో 21.4, కళ్యాణదుర్గం 13.4, గార్లదిన్నె 11.4, కూడేరు 11.2, యల్లనూరు 10.8, ఉరవకొండ 10.4, కణేకల్లు 10.0, రాప్తాడు 9.0, శింగనమల 8.4, రాయదుర్గం 7.8, అనంతపురం 5.4, బుక్కరాయసముద్రం 4.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 3.6 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం రాత్రి చిరుజల్లులు, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

వేరుశనగ తడిసిపోయింది



నేను నాలుగు ఎకరాల్లో వేరుశనగ, మరో నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. వర్షంతో రెండు పంటలకూ నష్టమే. వేరుశనగ తొలగించి పొలంలోనే కుప్పలు వేశాను. వర్షానికి మొత్తం తడిసిపోయింది. కట్టె కుళ్లిపోతోంది. పశువులకు మేత లేకుండా పోతుంది. కాయలు రంగు మారుతాయి. పత్తి కూడా దెబ్బతింటుంది. ఈ ఏడాది వ్యవసాయం కలిసిరాలేదు. అంతా నష్టమే.

-ప్రసాద్, బేతాపల్లి

జల వనరులకు కళ

చిత్రావతి ఉధృతితో నిలిచిన రాకపోకలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులకు భారీగా నీరు చేరుతోంది. న్యామద్దల, కనుముక్కల చెరువులు నిండి మరువ పారుతున్నాయి. వెల్దుర్తి, చిన్నపరెడ్డిపల్లి వద్ద చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు ప్రవాహ ఉధృతి తగ్గలేదు.

దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు బుక్కపట్నం, కొత్త చెరువు మీదుగా ప్రయాణం సాగిస్తున్నారు. ధర్మవరం ఆర్డీఓ మహేశ్, పీఆర్ ఎస్ఈ మురళీ, తహసీల్దారు సురేష్ కుమార్, డీఈ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్డీ అశోక్‌నాయక్ చిత్రావతి ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. చిత్రావతి ప్రవాహంతో ఏటా చాలా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాలురెడ్డి, పార్టీ నాయకులు పీఆర్ ఎస్ఈ మురళి దృష్టికి తీసుకెళ్లారు. రెండు ప్రాంతాలలో వంతెనల ఎత్తు పెంచాలని కోరారు. ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతామని ఇంజనీరింగ్ అధికారులు వారికి తెలిపారు. వర్షాల కారణంగా పలు గ్రామాల్లో పాత మిద్దెలు పడిపోయాయి.

ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలి: ఏపీటీఎఫ్

అనంతపురం విద్య, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ సమస్యలను వెంటనే పరిష్కరించాలని శ్రీసత్యసాయి జిల్లా ఏపీటీఎఫ్ నాయకులు ఏపీజీఎల్ఐ డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్‌ను కోరారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రవికుమార్, గోపాల్ నాయక్ తదితరులు గురువారం డీడీని కలిశారు. మెచ్యూరిటీ అయిన బాండ్లను సకాలంలో క్లెయిమ్ చేయడం లేదని అన్నారు. ఆరు నెలలుగా వీటిని ఏపీజీఎల్ఐ ఆఫీస్ మేకర్, చెక్కర్, అప్రూవ్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉంచుతున్నారని అన్నారు. కొత్తగా ఏపీజీఎల్ఐ ప్రీమియం మొత్తాన్ని పెంచినా, టీచర్ల కొత్త బాండ్స్ అసంపూర్తిగానే జనరేట్ అవుతున్నాయని అన్నారు. వివిధ రకాల రుణాల కోసం దరఖాస్తు చేసినా.. ఆరు మాసాలుగా విడుదల కావడం లేదని అన్నారు. కొత్తగా జారీ చేసిన బాండ్స్‌లో నామినీ వివరాలను నమోదు చేయడానికి అవకాశం ఇవ్వడం లేదని అన్నారు. బీమా మిస్సింగ్ క్రెడిట్స్ వెంటనే అప్‌డేట్ చేయాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.


డీడీకి వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

యువకుడి అదృశ్యం


నల్లప్ప

శింగనమల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తరిమెల గ్రామానికి చెందిన నల్లప్ప అనే యవకుడు సోమవారం అదృశ్యమయ్యాడు. ట్రాక్టర్ ఫైనాన్స్ వాయిదా మొత్తాన్ని చెల్లించేందుకు తన మామ రమణతో కలిసి నల్లప్ప సోమవారం అనంతపురం వెళ్లాడు. పని పూర్తి అయిన తరువాత నల్లప్పను రమణ ఆటో ఎక్కించి స్వగ్రామానికి పంపించాడు. కానీ నల్లప్ప గ్రామానికి చేరలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నల్లప్ప తల్లి రామాంజినమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శరత్ చంద్ర తెలిపారు.

ఆస్పత్రిలోనే రోగులకు

అన్ని సేవలు అందాలి

ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే అవసరం రాకూడదు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్


వీసీలో పాల్గొన్న సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓలు

అనంతపురం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగికి ఆస్పత్రిలోనే అన్నిరకాల వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. అమరావతి నుంచి ఆయన వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కృష్ణబాబు, డీఎంఈ నరసింహంతో కలిసి వైద్యాధికారులు, విభాగాధిపతులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్యులు, వైద్యాధికారులు సమయ పాలన తప్పనిసరిగా పాటించాలని అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రికి వచ్చిన ప్రతి రోగికీ సకాలంలో వైద్య చికిత్సలు అందిచాలని సూచించారు. రోగ నిర్ధారణ పరీక్షలను రాస్తే.. వాటిని సాయంత్రంలోపు పూర్తి చేయాలని, రోగికి అవసరమైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. మందులు, వైద్యం కోసం రోగులను బయటకు పంపకూడదని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రోగులు ఖర్చు పెట్టుకునే అవసరం రాకుండా చూడాలని అన్నారు. ఈ విషయంలో డాక్టర్లు బాధ్యతగా పని చేయాలని, వైద్యాధికారులు, హెచ్‌ఓడీలు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. రాత్రి విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బందికి కనీస వసతులు ఉండేలా సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాల కారణంగా రోగుల తాకిడి పెరిగే అవకాశం ఉంటుందని, ప్రత్యేక శ్రద్ధ పెట్టి వైద్యం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

సొసైటీ పురోగతిపై బాధ్యత లేదా..?

సమీక్షా సమావేశంలో జేసీ శివనారాయణశర్మ


మాట్లాడుతున్న శివనారాయణ శర్మ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సొసైటీ పురోగతిపై బాధ్యత మీకు లేదా అని ఏడీసీసీ బ్యాంకు అధికారులను బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ప్రశ్నించారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ సహకార భవన్‌లో ఏడీసీసీ బ్యాంకు మేనేజర్లు, సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బ్రాంచ్‌లు, సొసైటీల వారీగా పురోగతిని సమీక్షించారు. సొసైటీల కంప్యూటరైజేషన్ ప్రక్రియ ఆశించిన స్థాయిలో లేదని, వేగవంతం చేయాలని ఆదేశించారు. డిపాజిట్ల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నూతన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు విరివిగా రుణాలు అందజేసి వారి అభివృద్ధికి సహకారించాలన్నారు. తదుపరి సమావేశ సమయానికి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీసీఓ అరుణకుమారి, డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, ఓఎస్డీ సూర్యనారాయణ, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, నాబార్డు డీడీఎం అనురాధ, బ్యాంకు డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవ్‌బాబు, విజయచంద్రారెడ్డి, డీపీడీఎం తేజస్విని పాల్గొన్నారు.

టీచింగ్ పోస్టుల కోసం నేటి నుంచి

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

పది బృందాల ఏర్పాటు

అభ్యర్థులకు సమాచారం అందించాం: ఏపీసీ

అనంతపురం విద్య, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. సమగ్రశిక్ష ప్రాజక్టులో శుక్రవారం నుంచి వెరిఫికేషన్ చేయనున్నారు. ఇందుకోసం ఎంఈఓ లేదా హెచ్‌ఎంతోపాటు, స్కూల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌ని బృందంగా పెట్టారు. ఇలా 10 బృందాలను ప్రాజక్టు అధికారులు నియమించారు. ఖాళీగా ఉన్న పోస్టులకు 1877 దరఖాస్తులు వచ్చినట్టు జిల్లా ప్రాజక్టు అధికారులు తెలిపారు.

వెరిఫికేషన్‌కు సర్టిఫికెట్లు తప్పనిసరి

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా పదో తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ, మాస్టర్ డిగ్రీ(పీజీ), బీఈడీ, ఎంఈడీ, యూజీడీపీఈడీ, బీపీఈడీ, డిప్లొమో సర్టిఫికెట్లు తేవాల్సి ఉంటుంది. లోకల్ స్టేటస్, కుల, ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్లను వెంట తెచ్చుకోవాలి. దివ్యాంగులైతే అందుకు సంబంధించిన సర్టిఫికెట్ తప్పనిసరిగా తేవాలి. గతంలో పనిచేసిన అనుభవం ఉంటే ఎక్స్‌పీరియన్స్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంటుంది.

సమాచారం ఇచ్చాం: నాగరాజు, ఏపీసీ

శుక్రవారం ఉదయం 9.30 గంటలకు వెరిఫికేషన్ ఉంటుంది. 1:5 మేరకు అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించాం. సమాచారం అందిన అభ్యర్థులు మాత్రమే హాజరుకావాల్సి ఉంటుంది.


సమగ్రశిక్ష సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీసీ నాగరాజు


హాజరైన వాల్మీకులు

యువతకు వాల్మీకి స్ఫూర్తి

(5వ పేజీ తరువాయి)
బీసీలు, వాల్మీకులను గుర్తించడంలో సీఎం చంద్రబాబుకు ఎవరూ సాటి రారని అన్నారు. బడుగు, బలహీన వర్గాలు ఆనందంగా ఉన్నారంటే సీఎం చంద్రబాబు చలవేనని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో మళ్లీ ఎన్టీఆర్ విదేశీ విద్యను, అనేక రకాల పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. బీసీలకు బీసీ భవన్‌లను ఏర్పాటు చేశారని అన్నారు. వైసీపీ బీసీ భవన్‌లపై బండ వేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం బీసీ భవనాలను నిర్మించేందుకు సిద్ధమవుతోందని అన్నారు. వేడుకలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చాటిన విద్యార్థులకు మంత్రి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందించి అభినందించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారులు మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలను సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున, డీడీ కుష్బూకొఠారీ, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర, టీడీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, అనంతపురం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తలారి ఆదినారాయణ, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి, మాజీ మేయర్ స్వరూప, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, తెలుగు మహిళ నాయకురాలు సంగా తేజస్విని, బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు హరి, జనసేన నాయకుడు ఈశ్వర్, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఏబీసీడబ్ల్యూఓలు రంగమ్మ, సుభాషిణి, గంగాద్రి, బీసీ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సవిత


చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

ముందుండి నడిపిస్తా...



వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని ముందుండి నడిపిస్తా. పార్లమెంటు సమావేశాల్లో వాణిని గట్టిగా వినిపించి, ఎస్టీ జాబితాలో చేర్చేందుకు శాయశక్తులా కృషి చేస్తా. ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన వాల్మీకి జయంతిని రాష్ట్రస్థాయిలో ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సహకారంతో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించాం. వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి, మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడిన మహోన్నత వ్యక్తి. ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపుతాయి.

-అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం ఎంపీ

పార్లమెంటులో మాట్లాడతా..



అట్టడుగు స్థాయిలో ఉన్న బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం గురించి పార్లమెంటు సమావేశాల్లో మాట్లాడుతాను. ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి కేంద్రానికి పంపారు. ఎస్టీ జాబితా చేర్చే అంశం ప్రతి ఒక్కరి ప్రధాన అజెండా. అలాంటి అంశాన్ని వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి సర్వనాశనం చేశారు. వాల్మీకుల జీవితాలతో చెలగాటమాడి అంధకారంలోకి నెట్టేశారు. కృషి ఉంటే మనిషి రుషి అవుతారని చెప్పిన వాల్మీకి ఎంతో గొప్పవారు. అలాంటి వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలు అనంతలో జరగడం ఆనందంగా ఉంది.

- బీకే పార్థసారథి, హిందూపురం ఎంపీ

అందరికీ ఆదర్శం..



వాల్మీకి మహర్షి అన్ని వర్గాల ప్రజలకు ఎప్పటికీ ఆదర్శప్రాయుడే. ఎంతో విలువైన రామాయణాన్ని రచించి సంస్కృతి, సాంప్రదాయాలను నిలబెట్టారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం గురించి ఎంతో మంది మేధావులు, రాజకీయ నాయకులతో అప్పట్లో చంద్రబాబునాయుడు శాస్త్రీ అధ్యయనం చేయించారు. జగన్ ప్రభుత్వం ఆచరణలో పెట్టలేదు. వాల్మీకుల భవిష్యత్తుతో ఆడుకుంది. కూటమి ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని ప్రస్తావించి, కేంద్రానికి పంపి వాల్మీకుల్లో భరోసా నింపింది.

- కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే

ఎంపీలు చొరవ చూపాలి



వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలి. ఆ దిశగా జిల్లా ఎంపీలు చొరవ చూపాలి. నేను, కాలవ శ్రీనివాసులు మంత్రులుగా ఉన్నప్పుడు బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సానుకూలంగా స్పందించి అసెంబ్లీలో తీర్మానం చేయించారు. ఆ కల నెరవేరే సమయంలో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం ఆ అంశాన్ని గాలికొదిలేసింది.

- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

టీడీపీతోనే సాధ్యం..



వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ టీడీపీతోనే సాధ్యమవుతుంది. జిల్లాలో అధికంగా ఉన్న బోయలు తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎన్నో ఏళ్ల నుంచి కోరుకుంటున్నారు. చంద్రబాబు అసెంబ్లీలో తీర్మానం చేయించినా.. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాల్మీకులకు అన్యాయం జరిగింది. వాల్మీకుల న్యాయమైన డిమాండ్‌ను తెలుగుదేశం ప్రభుత్వమే సాధిస్తుంది. ప్రతి ఒక్కరూ వాల్మీకి ఆశయాల సాధనకు పాటుపడాలి.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

పార్టీని కాపాడుతున్న ముద్దుబిడ్డలు..



జిల్లాలో ఉన్న ఎంతో మంది వాల్మీకి ముద్దుబిడ్డలు టీడీపీని కాపాడుతున్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న కలను సీఎం చంద్రబాబునాయుడు సాకారం చేయాలని చూశారు. గతంలో అధికారంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి అడ్డు తగిలారు. కూటమి ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సిద్ధమైంది. అందులో భాగంగానే సీఎం చంద్రబాబు కేంద్రానికి ప్రతిపాదనలను పంపారు.

- అమిలినేని సురేంద్రబాబు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే

ఏకతాటిపైకి రావాలి...



వాల్మీకులు ఏకతాటిపైకి వచ్చి ఎస్టీ జాబితాను సాధించుకుందాం. ఎస్టీ జాబితా ప్రయత్నాలు పలుమార్లు జరిగాయి. తాజాగా చంద్రబాబునాయుడును ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్టీ రిజర్వేషన్ సాధన దిశగా అడుగులు వేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు సహకరిస్తే రాబోయే రోజుల్లో సీఎం సహకారంతో ఎస్టీ జాబితాలో బోయలను చేర్చడం సాధ్యమౌతుంది.

- గుమ్మనూరు జయరాం, గుంతకల్లు ఎమ్మెల్యే

వాల్మీకి స్ఫూర్తితో ముందుకెళ్లాలి..



రామాయణాన్ని రచించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి. ఆయన జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అనంతలో నిర్వహించడం గర్వకారణం. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలన్నది ఆ వర్గాల ఆకాంక్ష. ఎన్డీయే ప్రభుత్వంలో వారి కల సాకారమౌతుంది. ఇందుకు సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రస్తావించి కేంద్రానికి పంపడమే నిదర్శనం.

- బండారు శ్రావణిశ్రీ, శింగనమల ఎమ్మెల్యే

మాట నిలబెట్టుకుంటారు..



ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్. పాదయాత్రలో సమయంలో నారా లోకేశ్‌కు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం, జయంత్యుత్సవాలను రాష్ట్రస్థాయిలో నిర్వహించే అంశం గురించి విన్నవించాం. అధికారంలోకి వస్తే తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారు.. చేసి చూపించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సీఎం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. అనుకున్న ప్రకారం అసెంబ్లీలో ప్రస్తావించి కేంద్రానికి పంపారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకూ ప్రతి ఒక్కరూ పోరాడాలి.

- ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

భారతీయ సంస్కృతికి మూలం..



భారతీయ సంస్కృతి, జీవన విధానానికి మూలం రామాయణం. అలాంటి రామాయణ సృష్టికర్త వాల్మీకి పుట్టిన రోజును ఘనంగా జరుపుకుంటున్నాం. వాల్మీకి విలువలు, బోధనలు, జ్ఞానాన్ని అందరూ అందిపుచ్చుకోవాలి. రామాయణ ఇతిహాసాన్ని వాల్మీకి మహర్షి 23 వేల శ్లోకాలతో, ఏడు ఖండాలతో రచించారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతి ఉత్సవాన్ని అధికారికంగా రాష్ట్రస్థాయిలో జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని అనంతలో నిర్వహించేలా మంత్రి చొరవ చూపారు.

- పోలా భాస్కర్, బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

సంతోషకరం..



అనంతపురం జిల్లాలో మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయి వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరం. మంత్రి సవిత, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేశారు. వాల్మీకి రామాయణాన్ని రచించి, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడారు. ఆ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి.

- డాక్టర్ వినోద్ కుమార్, కలెక్టర్


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులతో మంత్రి, ఎంపీలు, కలెక్టర్, ఎమ్మెల్యేలు

నేరమయ జీవితం.. మృగతత్వంతో సమానం

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

కదిరి లీగల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): నేరమయ జీవితమనేది మృగతత్వంతో సమానమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన కదిరి సబ్‌జైలును గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. దోపిడీలు, చోరీలు, జూదాలు, అరాచకాలు, అత్యాచారాలు తదితర అసాంఘిక, ఆటవిక కార్యక్రమాలు మనుషులు చేసే పనులు కావన్నారు. వాటిని చేసి జైలుకెల్లడం సిగ్గుచేటన్నారు. అది కుటుంబ సభ్యులు, పిల్లలకు అవమానకరమని పేర్కొన్నారు. జైలుకు వచ్చిన తరువాత మార్పు రావాలన్నారు. అనంతరం ఖైదీలకు ఇస్తున్న ఆహారం, సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాదులు లోకేశ్వర్ రెడ్డి, దశరథ్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

కదిరి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ స్మిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పూర్తి చేసి 19 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సువారు అర్హులని, ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారు బెంగుళూరు, మంగళూరులో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లు తీసుకువాలని, పూర్తి వివరాలకు 93901 76421కు సంప్రదించాలని సూచించారు.

1.664 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో గురువారం 1.664 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు 1239 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 955 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు.

చేతిలో డబ్బులు పోయెనే..

మద్యం షాపుల కోసం రూ.లక్షల్లో ఖర్చు
లాటరీలో దక్కని దుకాణాలు
డబ్బు పోగొట్టుకుని గొల్లుమంటున్న నాయకులు



హిందూపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల లాటరీలో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వెళ్లి చోటామోటా నాయకులు చేతులు కాల్చుకున్నారు. పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకుని, షాపులు దక్కక దిక్కులు చూస్తున్నారు. ఎన్నడూలేని విధంగా మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈసారి చాలామంది ముందుకొచ్చారు. ఇతర ప్రాంతానికి వెళ్లి దరఖాస్తు చేసినవారూ ఉన్నారు. ఇతర రాష్ట్రాలవారు సైతం హిందూపురం ప్రాంతంలోని షాపులకు టెండర్లు వేశారు. వీరిలో కొందరికి దక్కగా.. మరికొందరికి నిరాశే మిగిలింది. ఈసారి కూటమి నేతలతోపాటు ప్రతిపక్ష నాయకులు సైతం టెండర్లు వేశారు. గతంలో మద్యం దుకాణాల వేలంలో కొంతమందే పాల్గొనేవారు. దశాబ్దాలుగా మద్యం దుకాణాల నిర్వహణపై అవగాహన ఉన్నవారు మాత్రమే అడుగుపెట్టేవారు. ఈసారి అధికార పార్టీకి చెందిన నాయకులు చాలామంది మద్యం దుకాణాలపై కన్నేశారు. వందల్లో టెండర్లు వేయగా.. వేళ్లమీద మాత్రమే దుకాణాలు దక్కాయి. 'లాటరీ పోయింది, లక్కు కలిసి రాలేదు. ఉన్న సొమ్ము పోయింది..' మద్యం దుకాణాల పోటీల్లో పాల్గొన్న చోటా నాయకుల పరిస్థితి ఇది. హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 11 షాపులు ఉండగా 270 వరకు దరఖాస్తులు అందాయి. వాటిలో కొంతమంది ఐదు, పది డీడీలు తీశారు. అయినా దక్కింది 11 మందికే. దీంతో దాదాపు 260 దరఖాస్తుల సొమ్ము పోయినట్లే. జిల్లావ్యాప్తంగా 87షాపులకుగాను 1518 మంది టెండర్లు వేశారు. 1431 టెండర్ల సొమ్ము నాయకులు కోల్పోయినట్లే. సొమ్ము పోయి.. షాపు రాకపోయేసరికి నాయకులు ఉసూరుమంటున్నారు.

లాటరీలో దక్కని షాపులు

తమకే దక్కుతుందని కొంతమంది నాయకులు.. బంధువుల పేరుపై ఐదు నుంచి పది టెండర్లు వేశారు. ఒకటీ దక్కలేదు. లాటరీలో ఎత్తిన టోకను రాకపోయేసరికి డబ్బు పోయి, షాపుపోయి అవమానం పాలయ్యామని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులే ఎక్కువగా పాల్గొని నష్టపోయినట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల వేరొకరికి షాపులు దక్కినా ప్రజాప్రతినిధులు.. వారిని పిలిపించి, కూటమి నాయకులకే ఇవ్వాలని హెచ్చరికలు జారీ చేశారు. కొన్నిచోట్ల ఒత్తిళ్లు, బెదిరింపులకు తలొగ్గి కూటమి నాయకులకు అప్పగించారు. మరికొన్నిచోట్ల లాటరీలో షాపులు దక్కించుకున్న ఇతరులు ఇవ్వడానికి ఇష్టపడలేదు. అలాంటిచోట కూటమి నాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. టీడీపీ నాయకులకు ఇది తీవ్ర నష్టమని ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు.

లక్షలు పోగొట్టుకుని...

మద్యం దుకాణాలకు దరఖాస్తుల రూపంలో సొమ్ము పోగొట్టుకుని పలువురు చోటా నాయకులు గొల్లుమంటున్నారు. నియోజకవర్గంలో మొత్తం తొమ్మిది షాపులు ఉండగా 271 దరఖాస్తులు వచ్చాయి. నాయకులు మద్యం వ్యాపారానికి భారీగా పోటీపడి దరఖాస్తు చేసుకున్నారు. చాలాచోట్ల గ్రూపులుగా ఏర్పడి మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. కొన్నిచోట్ల దక్కకపోవడంతో సొమ్ముపోయిందని గొల్లుమంటున్నారు. సొమ్ము పోగొట్టుకున్న వారిలో అధికశాతం టీడీపీ నాయకులే ఉన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు చేయడంతో చోటామోటా నాయకులు తీవ్రంగా నష్టపోయారు. ఏది ఏమైనా సొమ్ము పోయి.. షాపులు దక్కకపోవడంతో కూటమి నాయకులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి


జయరామ్ (ఫైల్)

కదిరి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రం గ్రామానికి చెందిన జయరామ్(45) గురువారం పిడుగు పడి మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జయరామ్ గురువారం గేదెలను మేపునకు తోలుకెళ్లాడు. పొలాల్లో పిడుగు పడి అతడు అక్కడికక్కడే మరణించాడు. సాయంత్రం గేదెలు ఇంటికి వచ్చాయే తప్ప.. జయరామ్ రాలేదు. దీంతో కుటుంబీకులు పొలాల్లో వెతకగా శవమై కనిపించాడు. దీంతో బోరున విలపించారు. జయరామ్‌కు భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు.

అనగనగా ఒక వీఆర్ఏ..!

- ఒక్కరోజూ విధులకు రాలేదు
- పన్నెండేళ్లపాటు విడపనకల్లు నుంచి జీతం
- ఒక్కడి కోసం.. నిబంధనలకు పాతర


లోకేశ్‌కు ఉద్యోగోన్నతి కల్పిస్తూ వచ్చిన ఆర్డర్ కాపీ

విడపనకల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సొంత గ్రామం, లేదా సొంత మండలంలో ఉన్నవారు వీఆర్ఏ పోస్టుకు అర్హులు. కానీ విడపనకల్లు మండలంలో గుర్తు తెలియని వ్యక్తికి ఆ పోస్టు ఇచ్చారు. ఏకంగా పుష్కర కాలంపాటు ఇక్కడి నుంచి అతనికి వేతనాలు చెల్లించారు. ఎవరైనా అడిగితే.. ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తుంటాడని స్థానిక అధికారులు సెలవిస్తున్నారు. అతని పేరు లోకేశ్. ఆయన ఉరవకొండ నియోజకవర్గం కాదు.. విడపనకల్లు మండలం కాదు. అనంతపురం నగరంలోని రాం నగర్‌లో ఉంటాడట. 2010-2011లో లోకేశ్‌ను విడపనకల్లు వీఆర్ఏగా చేర్చుకున్నట్లు చూపించి.. కథ నడిపిస్తున్నారు. ఇన్నేళ్లలో ఏ ఒక్క రోజూ విధుల్లో కనిపించింది లేదని, తహసీల్దారు కార్యాలయానికి వచ్చింది లేదని అంటున్నారు. అతన్ని చూసిన ఒక్క అధికారి కూడా ఇక్కడ లేరంటే అతిశయోక్తి కాదు.

ఎందుకంత ప్రాధాన్యం..?

విడపనకల్లు తహసీల్దారు కార్యాలయంలో రెండు వీఆర్ఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేసిందే లేదు. కానీ ఒక వీఆర్ఏ లోకేశ్ అని చూపిస్తున్నారు. డీఆర్వో కార్యాలయంలోని ఓ ఉద్యోగి కుమారుడు కావటంతో లోకేశ్‌కు విడపనకల్లు వీఆర్ఏగా ఒక పోస్టు ఏర్పాటు చేయించారని సమాచారం. తండ్రి పలుకుబడితో విడపనకల్లులో విధులు నిర్వర్తించకపోయినా.. ఇక్కడి నుంచి నెల నెలా జీతం పెట్టించారని ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది అక్టోబరులో ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించి.. గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయంలో వాచ్‌మన్‌గా పోస్టింగ్ ఇచ్చారు. విడపనకల్లు మండలంలోని వీఆర్ఏలు వంతులు వారిగా తహసీల్దారు కార్యాలయానికి రోజూ వచ్చి సాయంత్రం వరకూ విధులు నిర్వర్తించి వెళతారు. వీరిలో మహిళలు కూడా ఉన్నారు. కానీ లోకేశ్ మాత్రం ఒక్క రోజూ వచ్చింది లేదు. ఉద్యోగోన్నతి కల్పించాలని భావిస్తే.. లోకేశ్ కంటే మాళాపురం వీఆర్ఏ నారాయణస్వామి సీనియర్. కానీ నారాయణస్వామికి ఉద్యోగోన్నతి కల్పించలేదు. జూనియర్ అయిన లోకేశ్‌కు ప్రమోషన్ ఇచ్చారు. విడపనకల్లుకు చెందిన ఓ యువకుడు లోకేశ్ వివరాలను ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద ఏడాది క్రితం దరఖాస్తు చేశాడు. కానీ ఇప్పటి వరకూ రెవెన్యూ అధికారులు స్పందించలేదు. లోకేశ్ గురించి వివరణ కోరితే, అతనెవరో తనకు తెలియదని, రికార్డులు చూసి చెబుతానని తహసీల్దారు సునీతా బాయి అన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఏఎన్ఎంకు 6నెలల జైలు

పెనుకొండ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ఏఎన్ఎం వడ్డె భారతికి ఆరు నెలల సాధారణ జైలుశిక్ష, రూ.6 లక్షల అపరాధ రుసుం విధిస్తూ పెనుకొండ కోర్టు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ బుజ్జప్ప తీర్పు చెప్పినట్లు కోర్టు కానిస్టేబుల్ బాబ్‌జాన్ తెలిపారు. 2021లో గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి చెందిన వెంకటనారాయణమ్మ వద్ద ఏఎన్ఎం భారతి రూ.3లక్షలు అప్పు తీసుకుంది. ఆ మేరకు చెక్కులు ఇచ్చింది. బ్యాంకులో చెక్కులను డ్రా చేయడానికి వెళ్తే అవి చెల్లవనడంతో బాధితురాలు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం అగళిలో పనిచేస్తున్న ఏఎన్ఎం భారతికి రిమాండ్ విధించారు. ఆమెను రిమాండ్‌కు తీసుకుంటుండగా కుటుంబ సభ్యులు.. పోలీసులతో వాగ్వాదానికి దిగి, తప్పించారు. దీనిపై కూడా కేసు నమోదైంది. ఈ కేసులోనూ ఏఎన్ఎం భారతి ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో చెక్‌బౌన్స్ కేసును విచారించిన న్యాయాధికారి జైలుశిక్ష, అపరాధ రుసుం విధిస్తూ తీర్పు వెలువరించారు. అపరాధ రుసుం చెల్లించని పక్షంలో అదనంగా నెలన్నర జైలుశిక్ష అనుభవించాలని అందులో పేర్కొన్నారు.

సనాతన ధర్మ వ్యాప్తికి కృష్ణదేవరాయల కృషి


శ్రీకృష్ణదేవరాయల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మైనాస్వామి, నాయకులు

గోరంట్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ వ్యాప్తికోసం విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు విశేషంగా కృషి చేశారని చరిత్రకారుడు మైనాస్వామి అన్నారు. స్థానిక మాధవరాయ ఆలయంలో శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని గురువారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. మైనాస్వామి మాట్లాడుతూ.. విజయనగర సామ్రాజ్యంలో ఆలయాలను అధిక సంఖ్యలో నిర్మించడం ద్వారా సనాతన ధర్మపరిరక్షణకు రాయలవారు ఎంతగానో కృషిచేశారన్నారు. భక్తికోసం కాకుండా పరిపాలన కేంద్రం, విద్యాలయం, వైద్యాలయంగా ఆలయాలు ఉపయోగపడినట్లు చారిత్రక ఆధారాలున్నాయన్నారు. రాయలు అనుసరించిన ధర్మతత్వం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. విజయనగర సామ్రాజ్యంలో ప్రజలు సుఖంగా జీవించారన్నారు. ఉదయగిరి, రాయచూరు యుద్ధాలు మినహా రాయలు.. పెద్దగా యుద్ధాలకు అవకాశం ఇవ్వలేదన్నారు. ఆయన సైన్యాన్ని, రక్షణ పద్ధతులను తెలుసుకున్న శత్రురాజులు యుద్ధాలు విరమించుకుని రాయలకు సామంతులయ్యారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీశ్వర్, సుధాకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాయలసేవా సమితి సూరి, రామప్ప, నాగభూషణ, అశ్వత్థరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం


అలంకరణలో వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

అనంతపురం కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : లోకకల్యాణం కోసం శారదానగర్‌లోని శివబాల యోగి ఆశ్రమంలో గురువారం వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా స్వామివార్ల మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు, ఆలయ ఆవరణలో పలు హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్, ప్రసాద్, గాధంశెట్టి విశ్వనాథ, లక్ష్మీనారాయణ, మహేష్ పాల్గొన్నారు.


శివబాలయోగి ఆశ్రమంలో హోమాలు

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం నగరంలోని పలు ఆలయాల్లో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బెంగుళూరు రోడ్డులోని శివకోటి దేవాలయంలో సత్యనారాయణస్వామికి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు చేశారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు.

దసరా సర్వీసులతో పెరిగిన ఆర్టీసీ ఆదాయం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది దసరా పండుగ సందర్భంగా అనంతపురం రీజియన్ ద్వారా ఏపీఎస్ ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. దసరా పండుగను పురస్కరించుకుని ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో 173 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. గతేడాది దసరా సందర్భంగా నడిపిన ప్రత్యేక బస్సు సర్వీసుల ద్వారా అనంత ఆర్టీసీకి రూ.45లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.51.20లక్షలు వచ్చింది. ఈ లెక్కన రూ.6.20లక్షలు ఆదాయం పెరిగినట్లయింది.

రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయండి: ఆర్డీఓ

గార్లదిన్నె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జంబులదిన్నె వ్యవసాయ సహకార పరపతి సంఘంలోని రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్డీఓ వసంత బాబు తెలిపారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జంబులదిన్నె వ్యవసాయ సహకరా పరపతి సంఘానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ సంఘం సీఈఓ సదశివ మాట్లాడుతూ... జంబులదిన్నె వ్యవసాయ సహకరా పరపతి సంఘంలో సుమారు 7వేల మందికి పైగా ఖాతాదారులు ఉన్నారని, దాదాపు 775 మంది బకాయిలు ఉన్నారని తెలిపారు. వెంటనే సంఘంలోని రైతుల వివరానలు ఆన్‌లైన్ నమోదు చేయాలని ఆర్డీఓ సూచించారు.

నేటి నుంచి గ్రామసభలు

గార్లదిన్నె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో శుక్రవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బండారు ఈరమ్మ గురువారం తెలిపారు. రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఏవైనా సమస్యలుంటే గ్రామ సభలో తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని అంకంపేట, కృష్ణాపురంలో శుక్రవారం, కొప్పలకొండలో శనివారం, ఈ నెల 21న ఓబుళాపురం, జంబులదిన్నె, 22న మర్తాడు, బూదేడు, 23న కనుంపల్లి, సిరివరం, 24న కోటంక గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రామగిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ కొత్తపల్లికి చెందిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ తల్లి నారాయణమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత గ్రామానికివెళ్లి నారాయణమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకులు పరంధామయాదవ్, పేపర్ శీనా, మనోహర్, నాగేశ్ ఉన్నారు.

కనగానపల్లి: మండలంలోని నెమలివరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ గురువారం గ్రామానికి వెళ్లి లక్ష్మీనారాయణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశ్, కన్వీనర్ యాతం పోతలయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధాకర్‌చౌదరి, మాజీ జడ్పీటీసీ బిల్లేఈశ్వరయ్య, నారాయణ, పరమేశప్ప, వెంకటనారాయణ, శ్రీరాములు, శీన ఉన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

బుక్కరాయసముద్రం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు బుక్కరాయసముద్రం పోలీసులు తెలిపారు. శింగనమల మండలం ఆకులేడు గ్రామానికి చెందిన స్నేహితులు జయసింహ (22), సుబ్బరాయుడు (21) ఈనెల 13న అర్ధరాత్రి ఆకులేడు నుంచి అనంతపురానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మండల పరిధిలోని గుత్తిరోడ్డు ఏటీఎం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున సుబ్బరాయుడు, మధ్యాహ్నం జయసింహ మృతిచెందారు. రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు బుక్కరాయసముద్రం పోలీసులు తెలిపారు.

సీపీఐ కాలనీలో కార్డెన్ సర్చ్

నార్పల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సీపీఐ చైతన్య కాలనీలో గురువారం పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహిం చారు. దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌పై కాలనీ ప్రజలకు పోలీసు లు అవగాహన కల్పించారు. అలాగే ఎటువంటి రికార్డులు లేని 15దిచక్రవాహనాలను సీజ్ చేశారు.

వ్యభిచార గృహంపై దాడులు

అనంతపురం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఓ అద్దె ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఫోర్త్‌టౌన్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. నిర్వాహకుడిని, ఓ విటుడిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.24,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఓ అమ్మాయిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్టు పోలీసులు తెలిపారు.

ప్రతి గ్రామంలో రోడ్లు వేయిస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత


గొందిరెడ్డిపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాప్తాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలో ని గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. గొందిరెడ్డిపల్లిలో రూ. 14.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. రూ. లక్ష సొంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. పుల్లలరేవులో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, రూ. 6.90 లక్షలతో నిర్మిస్తున్న మూడు గోకులం షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ... ఏ గ్రామంలో ఏ పని చేయాలో ప్రజలు నిర్ణయిస్తే వెంటనే దానిని చేయిస్తామ న్నారు. ఐదేళ్లలో ప్రతి గ్రామంలో రోడ్లు వేస్తామని, ప్రతి గ్రామానికి ప్రధాన రహదారి సమస్య లేకుండా పరిష్కరిస్తామన్నారు. వైసీపీ పాలనలో చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కరించలేకపోయారన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సాయినాథ్‌నాయుడు, సర్పంచులు శీనయ్య, తిరుపాలు, ఎంపీటీసీ జాఫర్, వెంకటరాముడు, వాటర్‌షెడ్ చైర్మన్ మల్లి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.


సోములదొడ్డిలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

వర్షంలోనూ ఆగని పల్లె పండుగ

అనంతపురంరూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం పల్లె పండుగ వర్షంలోనూ కొనసాగింది. టీడీపీ మండల నాయకులు, అధికారులు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని సోములదొడ్డి, పాపంపేట, ఆకుతోటపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు భూమిపూజలు చేశారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ కాపుకార్పొరేషన్ డైరెక్టర్ పాముదాయి వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగే మురళి, ఎంపీటీసీ లక్ష్మి, విశ్వనాథ్, చల్లా నాయుడు,వెంకటరాముడు, పూల నారాయణస్వామి, రామాంజినేయులు, బాబావలి, గోవిందు, లక్ష్మీదేవి, సాలమ్మ, పంచాయితీ కార్యదర్శులు అశోక్‌బాబు, ప్రవీణ్‌బాబు, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఆకుతోటపల్లిలో...

'పాస్టర్లకు గౌరవ వేతనం ఇప్పించండి'


మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం ఇస్తున్న స్వామిదాస్

అనంతపురం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాస్టర్లకు గౌరవం వేతనం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి దాస్ కోరారు. ఆయన గురువారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి చాంబర్‌లో మంత్రి ఫరూక్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. క్రిస్మస్ పండుగలోగా క్రిస్టియన్ భవన్‌ను పూర్తి చేయాలని కోరారు. మ్యారేజ్ సర్టిఫికెట్ లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పాస్టర్లకు త్వరగా మంజూరయ్యాలా చొరవ చూపాలని కోరారు.

సాగు, తాగునీటిపై నిర్లక్ష్యం వీడాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

శింగనమల/గార్లదిన్నె, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు సాగు తాగునీటిపై పాలకుల నిర్లక్ష్యం వీడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి రాంభూపాల్ పేర్కొన్నారు. గురువారం సీపీఎం సాగునీటి కోసం బస్సుయాత్ర మండలంలోని కల్లుమడి, తరిమెల, నిదనవాడ రాచేపల్లిల్లో నిర్వహించారు. ఈసందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ప్రభుత్వాలు సాగునీటిని రైతులకు హక్కులా విడుదల చేయాలని, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. సీపీఎం నాయకులు నాగరాజు, చంద్ర శేఖర్, భాస్కర్, కొండారెడ్డి, శ్రీనివాసులు, సుంకన్న, తదితరులు పాల్గొ న్నారు. అలాగే బస్సు యాత్ర గార్లదిన్నె మండలం కల్లూరులో జరగింది. నీలం సంజీవరెడ్డి సర్కిల్‌లో రాంభూపాల్ రైతులను కలసి మాట్లాడారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సావిత్రి, చెన్నారెడ్డి, నల్లప్ప, ఓబులేశు, నాగమ్మ, రాము, షేక్షావలి, రమేజా, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి: సీపీఎం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తాగు, సాగునీటి సాధన కోసం ఈనెల 21న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం నగర ఒకటో కమిటీ కార్యదర్శి రామిరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పట్ల పాలకులు నిర్లక్ష్యం వీడాలంటూ ఈనెల 15 నుంచి సీపీఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టామన్నారు. బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 21న కలెక్టరేట్ ఎదుట చేపట్టే మహాధర్నాలో మేధావులు, రైతులు, ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, ఎర్రిస్వామి, ప్రసాద్, వెంకటేష్, గఫూర్, జీవ, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

'విజయవాడ నుంచే హజ్‌యాత్ర ప్రారంభించాలి'

అనంతపురం క్రైం,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచే హజ్ యాత్ర కొనసాగించేలా ప్రభుత్వం దృష్టి సారించాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. ఆయన గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ముస్లింలు హజ్‌యాత్రకు హైదరాబాద్, బెంగుళూరు నుంచే వెళ్లాల్సి ఉండేదన్నారు. హజ్ యాత్రుకు రూ.లక్ష సాయం అంది స్తామని ఇచ్చిన హామీని కూటమి నేతలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆలయ కార్యవర్గం ఎంపిక

రాప్తాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సమీపంలోని పండమేటి లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీని గురువారం సాయంత్రం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా చెడిపోతుల అంజనీ వెంకటరాముడు, ఉపాధ్యక్షుడిగా చిల్లర లక్ష్మయ్యతోపాటు మరో 22 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు అంజనీ వెంకటరాముడు తెలిపారు.

మడుగు కాదిది... రోడ్డే..!



చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటికొండ గ్రామంలో ప్రధాన రహదారపైపై వర్షపు నీరు నిలిచి మడుగును తలపిస్తోంది. వర్షం కురిసినప్పుడల్లా నీరు నిలుస్తుండటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రధాన రోడ్డుపై పెద్దఎత్తున నీరు నిలిచింది. రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన కాలువను నాలుగేళ్ల క్రితం స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి వైసీపీ అండతో మట్టితో పూడ్చివేశాడని, అప్పటి నుంచి ఈ సమస్య తలెత్తిందని పలువురు గ్రామస్థులు అంటున్నారు. రోడ్డుపై దాదాపు రెండు వారాల పాటు నీరు నిల్వఉంటుందని, రాకపోకల సమయంలో పలువురు జారి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. అంతేకాకుండా రోజుల తరబడి నీరు నిల్వఉండటంతో చుట్టుపక్కల ఇళ్లు దెబ్బతింటున్నాయని వారు వాపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాల్మీకి బోధనలు సమాజానికి అవసరం: ఎస్పీ


వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): :వాల్మీకి మహర్షి చేసిన బోధనలు సమాజానికి ఎంతో అవసరమని జిల్లా ఎస్పీ జగదీష్ అభిప్రాయపడ్డారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొ ని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, ఎస్పీ సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, ఆర్ఐలు రెడ్డప్పరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు, ఎస్కేయూలో వీసీ అనిత

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) :వాల్మీకి మహర్షి చాటిన మానవతావిలువలు పాటించాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో గురువారం వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎస్కేయూలో నిర్వహించిన వేడుకల్లో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై పూజలు చేశారు.

ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ సరికాదు

● డీఈఓకు ఏపీటీఎఫ్ నాయకుల వినతి

అనంతపురం విద్య, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఆరు రోజులపాటు రెసిడెన్షియల్ శిక్షణ సరికాదని, దానిని మార్చాలని ఏపీటీఎఫ్ నాయకులు డీఈఓ వరలక్ష్మిని కోరారు. ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం సంఘం నాయకులు డీఈఓను ఆమె చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... 1,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రెసిడెన్షియల్ శిక్షణ ఇచ్చే పరిస్థితులున్నాయన్నారు. అయితే ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ వల్ల టీచర్లు దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్నారన్నారు. రెసిడెన్షియల్ తరహా శిక్షణ వద్దంటూ డీఈఓకు వినతిపత్రం అందించారు. సంఘం పూర్వపు రాష్ట్ర ప్రధానకార్యదర్శి నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్‌వలి, వెంకటరమణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, నాయకులు రంగనాయకులు, సూర్యనారాయణ, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కాంప్లెక్స్ స్థాయిలో ఇవ్వాలి: ఎస్టీయూ

అనంతపురం విద్య: జిల్లావ్యాప్తంగా 1,2 తరగతులు బోధించే టీచర్లకు అందించే ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమాన్ని స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధా నకార్యదర్శి రామాంజినేయులు ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో కోరారు. టీచర్లకు బోధనేతర కార్యక్రమాలు ఇప్పటికే ఎక్కువగా ఉన్న పరిస్థితిలో ఈ శిక్షణ కార్యక్రమం వల్ల మరిన్నిరోజులు వారు బోధనకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. గర్భిణులు, చంటిపిల్లలున్న తల్లులు, వృద్ధుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ శిక్షణను రద్దు చేసి కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించాలని కోరారు.

పాఠశాల నుంచే ఉపాధి విద్య శుభపరిణామం

అనంతపురం విద్య: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఉపాధి నైపుణ్య విద్యను అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ యోచిస్తుండటం మంచి పరిణామం అని టీఎన్‌యూఎస్, ఎస్టీయూ పూర్వపు ఉపాధ్యక్షులు సూదలకుంట కిష్టప్ప గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలను నైపుణ్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ఆలోచన మంచిదని, అందుకు కృషి చేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సీఎం చంద్రబాబునాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎస్కేయూ పీజీ సీట్లను భర్తీచేయాలి

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : ఎస్కేయూలోని పీజీ కోర్సుల సీట్లను భర్తీచేయాలని రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబును ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం రిజిస్ట్రార్‌ను కలిసి విన్నవించారు. అనంతరం నాయకులు రజనీకాంత్, మహేష్, శ్రీనునాయక్ మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో వర్సిటీల స్వయంప్రతిపత్తిని కాలరాసిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి సెంట్రలైజ్డ్ అడ్మిషన్స్‌ను నిర్వహించిందన్నారు. దీంతో ఎస్కేయూలో పీజీ కోర్సుల సీట్లు 30శాతం మించలేదన్నారు. అదే మాదిరి ఈ సంవత్సరం కొనసాగిందని, నిబంధనలు ఎత్తివేసి డిగ్రీ పాసైన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని డిమాండ్‌చేశారు.

'యువత భాగస్వామ్యంతోనే మాదకద్రవ్య రహిత సమాజం'

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): యువత భాగస్వామ్యంతోనే మాదకద్రవ్యాల రహిత సమాజ స్థాపన సాధ్యమవుతుందని పలువురు అధికారులు పేర్కొన్నారు. కేంద్ర యువజన, క్రీడాశాఖ, మైభారత్, నెహ్రూ యువకేంద్రం, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో 'యువతకు మత్తు పదార్థాలు-మా దక ద్రవ్యాల నివారణ' అనే అంశంపై గురువారం అవ గాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎన్‌వైకే కార్యాలయంలో జరిగిన ఈ కార్య క్రమంలో ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎస్కే యూనివర్శిటీ ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య మురళీధర్ రావు, వన్‌టౌన్ ఎస్సై శ్రీనివాసులు మాట్లాడుతూ...సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు ప్రసాద్, నెహ్రూయువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, మానసిక వైద్య నిపుణులు బాలాజీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, మురళీకృష్ణ, ప్రణతి, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నగరంతో పాటు రూరల్ మండలం, రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లో ని ప్రభుత్వ కార్యాలయాలు, టీడీపీ నాయకులు, వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా పూజలు చేశారు. వాల్మీకి జీవిత చరిత్ర అందరికీ ఆదర్శమని పలువురు పేర్కొన్నారు.



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):: స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో కోచ్‌లు, క్రీడాకారులు వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. డీఎస్‌డీఓ షఫీ, సూపరిండెంట్ దేవమణి, కోచ్‌లు అనిల్‌కుమార్, నరేష్, వంశీ, సంధ్య, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



● అనంతపురం టౌన్: జిల్లావైద్యశాఖ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలువేసి పూజలు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గిరిజా మనోహర్, డెమో త్యాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



● గార్లదిన్నె: వాల్మీకి జయంతిని పురష్కరించుకుని గార్లదిన్నె, కల్లూరు గ్రామాల్లో వాల్మీకులు ఆయన విగ్రహానికి పూజలు చేశారు. సాయంత్రం గార్లదిన్నెలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. టీడీపీ బీసీసెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇల్లూరు రామాంజినేయులు, తరిమెల సూరి, సుంకన్న, బొగ్గుల వెంకటేష్, వడ్డ రాము, మిషన్ గోపాల్, బీఎస్ రవి, రఘురాముడు, నాగేంద్ర, పుల్లన్న, గోవిందు, పరమేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: మండల కేంద్రంలోని వాల్మీకి ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. వాల్మీకి సంఘం కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



● కనగానపల్లి: మండల కేంద్రంలోని కొల్లాపురమ్మ ఆలయం వద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు. టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ సుదాకర్‌చౌదరి, నాయకులు అంకే రామకృష్ణ, రాజాకృష్ణ, ఎస్వీరమణ, నారాయణస్వామి, పోతలయ్య, నాగేశ్ పాల్గొన్నారు.



● శింగనమల: మండలంలోని పలుగ్రామాల్లో వాల్మీకి జయంతిని ఘనం గా నిర్వహించారు. శింగనమలలో ఆత్మారామస్వామి గుడి వద్ద వాల్మీకి చిత్రపటానికి ఎంపీడీఓ నిర్మలకుమారి, వాల్మీకి కులస్థులు పూజలు చేశా రు. ఆనందరావుపేటలో వాల్మీకి విగ్రహనికి గ్రామస్తులు పూజలు చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం చేసి, వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు.



● రాప్తాడు: మరూరు, బండమీదపల్లి, యర్రగుంట, రాప్తాడు తదితర గ్రామాల్లో వాల్మీకులు వాల్మీకి మహర్షి విగ్రహాలను అలంక రించి పూజలు చేశారు. మరూరులో టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, రాప్తాడులో సాకే జయరాముడు తదితరులు వాల్మీకి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మరూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


పేరూరులో వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

● రామగిరి: మండలంలో పలు గ్రామాల్లో వాల్మీకి కులస్థులు వాల్మీకి చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీహరిపురంలో కుంటిమద్ది, పోలేపల్లి, రామగిరి, పేరూరు, తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకున్నారు.


రామగిరిలో జ్యోతులు, బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

విజయసాయికి ఎల్‌వీ ప్రసాద్ అవార్డు


అవార్డు అందుకుంటున్న విజయసాయి

అనంతపురం కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్‌కు నేత్రదానంలో చేసిన సేవలకుగాను ఎల్‌వీ ప్రసాద్ అవార్డు వరించింది. ఆయనకు గురువారం సాయంత్రం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆ ఆస్పత్రి సెమినార్ హాల్‌లో ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ జీఎన్ రావు చేతులమీదుగా ఎల్‌వి ప్రసాద్ అవార్డు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేవిపి రామచంద్రరావు, లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివలింగ ప్రతిష్ఠ

గుత్తి రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం గ్రామస్థుల ఆధ్వర్యంలో అర్చకులు శివలింగ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే ఆలయంలో హోమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటలకు వేదమంత్రోచ్చారణల నడుమ శివలింగాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.

పేర్లు నమోదు చేసుకోండి

గుంతకల్లు టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేయడానికి 25శాతం సబ్సిడీతో విత్తన పప్పుశనగ కోసం రైతులు పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ స్వాతి గురువారం ప్రకటనలో తెలిపారు. పప్పుశనగ క్వింటాలు రూ.9400లు అని, సబ్సిడీ ధర రూ. 2350లు పోగా.. రైతులు రూ.7050 చెల్లించాలని అన్నారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్‌ఫోన్ తీసుకుని సంబంధిత రైతు సేవ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుని విత్తనాలు తీసుకెళ్లాలని ఆమె సూచించారు.

నాణ్యమైన విత్తనాలు అందిస్తాం

బెళుగుప్ప, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్లో రైతులకు నాణ్యతతో కూడిన విత్తన పప్పుశనగ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయాధికారి వాసుకిరాణి తెలిపారు. విత్తన పప్పుశనగను స్థానిక వినాయ క సీడ్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఆమె గురువారం తనిఖీ చేసి విత్తన నాణ్యత పరిశీలించారు. పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులందరికీ సబ్సిడీ విత్తనాలు అందిస్తామమన్నారు. ఏఓ పృథ్వీసాగర్ ,ఏపీ సీడ్స్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ పంపిణీ

పుట్లూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు సచివాలయ పరిధిలో గురువారం విత్తన పప్పుశనగ పంపిణీ చేశారు. అధికారులతో కలిసి టీడీపీ నాయకులు విత్తన బస్తాలను రైతులకు అందించారు. టీడీపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, గోవర్ధన్ రాజు, ఎంపీఈఓ సర్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చెట్నేపల్లికి చెందిన ఏపీట్రాన్స్‌కో ఉద్యోగి రంగయ్య గురువారం గుత్తి నుంచి నుంచి స్వగ్రామానికి బైక్‌లో వెళ్తూ.. ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిలిచి ఉన్న లారీని ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



కళ్యాణదుర్గంలో వాల్మీకి జయంతి వేడుకలో ఎమ్మెల్యే అమిలినేని తదితరులు



తాడిపత్రిలో వాల్మీకి విగ్రహానికి నమస్కరిస్తున్న జేసీపీఆర్



గుంతకల్లులో వాల్మీకి జయంతిలో పాల్గొన్న టీడీపీ నాయకులు



రాయదుర్గంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకులు

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి

- ప్రతిఒక్కరూ ఆయన బాటలో పయనించాలి
- జయంతి వేడుకల్లో వక్తల పిలుపు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: మహర్షి వాల్మీకి ఆదర్శప్రాయుడని వక్తలు కొనియాడారు. ఆయన జయంతి వేడుకలను గురువారం గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో అన్ని పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. పలుచోట్ల వాల్మీకి చిత్రపటాన్ని ప్రత్యేక వాహనాల్లో ఉంచి ఊరేగింపు చేశారు.

కళ్యాణదుర్గం పట్టణంలోని వాల్మీకి సర్కిల్లో ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబు వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వేటగాడిగా ఉన్న వాల్మీకి పరిణితి చెంది రామాయణం రచించి మహర్షి అయ్యారని తెలిపారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా చేసుకుని ప్రతిఒక్కరూ ముందుకెళ్లాలని సూచించారు. ఇక్కడి వాల్మీకి కూడలిని మరింత అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన సర్కిల్‌గా తీర్చిదిద్దుతామని, అలాగే వాల్మీకి మహర్షి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తర్వాత స్థానిక ప్రజావేదికలో ఆయన వాల్మీకి జయంతిని నిర్వహించారు. తాడిపత్రి పట్టణంలో యల్లనూరురోడ్డు సర్కిల్‌లో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. గుంతకల్లు పట్టణంలో టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ తదితరులు వాల్మీకి విగ్రహాలకు పూజలు చేశారు. రాయదుర్గం పట్టణంలో వాల్మీకి సంక్షేమ సేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు బండి క్రిష్టప్ప ఆధ్వర్యంలో వాల్మీకులు పెద్దఎత్తున బైక్‌ర్యాలీ చేశారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగింది.

పేదల ఆకలి తీర్చేందుకే అన్నక్యాంటీన్



అన్నక్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుత్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆకలి తీర్చేందుకే సీఎం చంద్రబాబు అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలో ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను గురువారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అన్నక్యాంటీన్లలో రూ.5కే నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తర్వాత ఎమ్మెల్యే స్వయంగా ప్రజలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు శ్రీనివాసులు, టీడీపీ నేత గుమ్మనూరు నారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియ, తహసీల్దార్ ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

రైతులంటే అంత అలుసా..!

- మద్యం మీద ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదా..?
- బస్సుయాత్రలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

పామిడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వానికి రైతన్నలంటే అంత అలుసా అని, మద్యం, ఇసుకపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదా అని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మండిపడ్డారు. సాగునీటి సాధనకై పోరాడుదాం - కరువు నుంచి కాపాడుకుందాం పేరుతో సీపీఎం చేపట్టిన బస్సుయాత్ర గురువారం పామిడికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాంభూపాల్ మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రైతన్నలపై ఎలాంటి శ్రద్ధ చూపలేదన్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి రైతులు గట్టిగా గుణపాఠం నేర్పారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం, ఇసుక టెండర్లపై ఉన్న శ్రద్ధ రైతన్నలపై చూపడం లేదని మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువల్లో నీరు లేకున్నా పల్లెపల్లెలో మద్యం ఏరులై పారుతోందని నిప్పులు చెరిగారు. సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలన్నారు. రైతు కుటుంబాలకు ఆడపిల్లలను సైతం ఇవ్వలేనంత దుస్థితి ఏర్పడిందన్నారు. రైతులందరూ ఐకమత్యంతో పోరాడితే సమస్యలు యుద్ధప్రాతికన పరిష్కారమవుతాయన్నారు. ఈ నెల 21న అనంతపురంలోని కలెక్టర్ ఆఫీసు వద్ద చేపట్టే మహాధర్నాకు రైతులు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్, రైతు సంఘం అధ్యక్షుడు ముత్యాలు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నిర్మల, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

కూడేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరులో విద్యుదాఘాతంతో వృద్ధుడు చిన్నఓబులేసు (79) మృతి చెందాడు. వర్షానికి ఇంటి కప్పు కారుతుంటే గురువారం ఉదయం చిన్నఓబులేసు నీళ్లు కారకుండా మిద్దె ఎక్కి మట్టిని వేస్తున్నాడు. ఆ సమయంలో అక్కడ విద్యుత్ వైర్లను తాకి షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య రామలక్ష్మమ్మ, నలుగురు కుమారులు ఉన్నారు. కుమారుడు నరసింహులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా చింతలరాయుడి కల్యాణం

- కన్నులపండువగా రథోత్సవం



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



భక్తుల నడుమ రథోత్సవం

తాడిపత్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తొలుత అర్చకులు ఆలయంలో మూల విరాట్‌ను పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీదేవిభూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను రథంపై ఉంచి పట్టణంలోని మెయిన్‌బజారు, అభయాంజనేయస్వామి విగ్రహం వరకు రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బోరంపల్లిలో చిరుత సంచారం

కళ్యాణదుర్గం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లి గ్రామ పొలిమేరలో గురువారం చిరుతపులి సంచరిస్తుండడాన్ని గ్రామస్థులు చూసి భయాందోళనకు గురయ్యారు. బోరంపల్లి నుంచి గంగవరంలోని అరటితోటకు వెళుతున్న కూలీలు చిరుతపులిని చూసి భయపడి సమీప తోటల్లోకి పరుగెత్తారు. చిరుత బోరంపల్లి నుంచి గంగవరం గ్రామం వైపు వెళుతున్నట్లు గమనించి వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని చేరవేశారు. చిరుతపులి సంచారంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. అటవీ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పామిడి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న గురువారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్నిశాఖాధికారులు తప్పక హాజరవ్వాలని కోరారు.

అపరిశుభ్రంగా ఉంటే దుకాణాలను మూసివేయిస్తాం

తాడిపత్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కేవలం రెండునెలల సమయం మాత్రమే ఇస్తున్నానని, జనవరి నుంచి అపరిశుభ్రత ఏ దుకాణం ముందు కనిపించినా మూసివేయిస్తామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం చికెన్, మటన్, కోళ్లఫారం, కోడిగుడ్ల వ్యాపారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. రెండునెలలు మాత్రమే సమయం ఇస్తున్నానని, అప్పటిలోగా ప్రతి దుకాణం ముందు కొంచెం కూడా అపరిశుభ్రత కనిపించకూడదని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే షాపులను మూసివేయిస్తానని అన్నారు. ప్రతి దుకాణానికి లైసెన్సును కలిగి ఉండాలన్నారు. అనంతపురం, నార్పల, యాడికి తదితర మండలాలతో పోలిస్తే తాడిపత్రిలో మాంసం ధరలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రజలకు అందుబాటులో ధరలను ఉంచాలని సూచించారు. చికెన్, మటన్, గుడ్ల ధరలను ఎప్పటికప్పుడు మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

శ్రీ సార్థ జ్ఞానేశ్వరి గ్రంథం ఆవిష్కరణ

పామిడి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాండురంగస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం శ్రీ సార్థ జ్ఞానేశ్వరి తెలుగు అనువాద గ్రంథాన్ని పండరీపురం వార్కరి సాంప్రదాయ గురు పరంపర అధిపతి ఎనిమిదవ గురువు గోపాల్ తుకారం వాస్కర్ మహారాజ్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని డబ్బీదార్ పీర్కా అధ్యక్షుడు శ్రీనివాసరావుకు అందజేశారు. ముందుగా ఈ గ్రంథం ప్రతులతో పట్టణ పురవీధుల గుండా నగర ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో వేణుగోపాలరావు, ముకుందరావు, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ నగేష్ బాధ్యతల స్వీకరణ

కుందుర్పి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా నగేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కర్నూలు జిల్లా నుంచి ఇక్కడి బదిలీపై వచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

విడపనకల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. పేకాటాడుతున్నట్లు సమాచారం రావటంతో వెంటనే ఎస్ఐ ఖాజా హుస్సేన్ తన సబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు చేశారు. అందులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రాయదుర్గం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోతిగుట్ట ఏరియాలో గల డ్రైవర్స్‌కాలనీలో యువకుడు లాలు(25) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డ్రైవర్స్ కాలనీకి చెందిన లాలు కారు డ్రైవర్‌గా జీవనాన్ని సాగిస్తున్నాడు. కాగా గురువారం సాయంత్రం అతను ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఎస్ఐ బాలరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. యువకుడి మృతికిగల కారణాలు పోలీసులు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.


22న జాబ్‌మేళా

రాయదుర్గంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 22వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం టాటా ఎలక్ట్రానిక్స్, కొంజేంట్ సర్వీసెస్ కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు రాయదుర్గానికి వస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ, డిప్లొమా ఇంటర్ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 22వ తేదీన ఉదయం 9 గంటలకు నిరుద్యోగులు తమ సర్టిఫికేట్ కార్డులతో పాటు హాజరు కావాలని ఆయన సూచించారు.

టపాసుల విక్రయానికి స్థల పరిశీలన

యాడికి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో టపాసుల విక్రయానికి గురువారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టపాసు విక్రయకేంద్రాలు జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దుకాణదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు జరపాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే విక్రయ లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. సీఐ ఈరన్న, డీటీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సహకార సంఘం కార్యాలయం తనిఖీ



గ్రామంలో పర్యటిస్తున్న ఆర్డీవో వినూత్న

బెళుగుప్ప, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులెన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని ఆర్డీవో వినూత్న గురువారం తనిఖీ చేశారు. సహకార సంఘం ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటంతో ముందు జాగ్రత్తగా ఆమె ఈ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఈవో మల్లికార్జునను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘంలో 6,465 మంది రైతులు ఉండగా ఆధార్ అనుసంధానం నమోదు చేయకుండా వుండటంతో సీఈవోపై మండిపడ్డారు. ఆయా గ్రామాల వీఆర్వోల సహకారం తీసుకుని వెంటనే పూర్తి చేయాలని సూచించారు. లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ షర్మిల, సర్పంచ్ రాము, వీఆర్వోలు రమేష్, మధు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యల్ని పరిశీలించారు. వివిధ సమస్యల్ని ప్రజలు తెలపడంతో వాటిపై నివేదిక పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.